సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



ఆటలో మెరిసేలా..!

నందలూరు సౌమ్యనాథాలయ రథం దారిలో ఐదు ఎకరాలను మహమ్మద్‌షేక్ పదేళ్లకు లీజుకు తీసుకున్నారు. దానిని క్రికెట్ స్టేడియంగా రూపొందిస్తున్నారు. -8లో



మీ సహకారం మరువలేను

జిల్లా ఎస్పీగా సేవలందించి బదిలీ అయిన వి.విద్యాసాగర్‌నాయుడుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.240
రెండోరకం	రూ.130	రూ.180



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	660	680



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 200.240 కిలోలు

న్యూస్‌రీల్

ఈ-క్రాప్ నమోదు గడువు పెంపు

రాయచోటి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు గడువును ఈనెల 25వ తేదీ వరకు పెంచారు. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జి శివనారాయణ శనివారం తెలిపారు. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పు చేర్పులకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. తుది జాబితాను ఈనెల 31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సారి ఈకేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పేర్కొన్నారు.

రూ.3.30 లక్షలకు తలనీలాల వేలం

సిద్దవటం: కార్తీక మాసంలో భక్తులు నిత్యపూజయ్య స్వామికి సమర్పించే తలనీలాల పోగు హక్కు కోసం శనివారం నిర్వహించిన వేలంపాటలో రూ.3.30 లక్షలకు హెచ్చుపాటదారుడు దక్కించుకున్నాడు. దేవదాయశాఖ ఈఓ శ్రీధర్, రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన వేలంపాటలో 16 మంది పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు, ప్రొద్దుటూరు, చాపాడు, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాలకు చెందిన ఐదుగురు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఇందులో చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన జి.రామక్రిష్ణ రూ.3.30 లక్షలకు తలనీలాల పోగు హక్కును దక్కించుకున్నాడు. అనంతరం మిగిలిన డబ్బులు చెల్లించి అధికారుల నుంచి రసీదును పొందారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



నూతన పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట (సిద్దవటం): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం స్నపన తిరుమజనం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ వారు సమర్పించిన నూతన పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

వీరభద్రస్వామికి రూ.22,99,430 ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. జులై 1వ తేది నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.22,99,430 వచ్చినట్లు ఈవో డీవీ రమణా రెడ్డి తెలిపారు. అలాగే 43.063 గ్రాముల బంగారం, 1.870 కిలలో వెండి వచ్చిందని చెప్పారు. ఈ మొత్తం ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకులో జమ చేశామని వివరించారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపిక



దీపన్ సాయినాథ్

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణానికి క్రికెట్ క్రీడాకారుడు దీపన్ సాయినాథ్ అంధ్రా రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపికైనట్లు వాల్మీకిపురం సీడీసీఎ హెడ్‌కోచ్ సునీల్ కుమార్ తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ దీపన్ సాయినాథ్ లెఫ్టహ్యాండ్ స్పిన్ బౌలర్‌గా చిత్తూరు జిల్లా జ ట్టుకు, అనంతరం సౌత్‌జోన్ నుంచి ఉత్తమ ప్ర తిభ కనపరచి ఆంధ్ర రంజీ క్యాంపునకు ఎంపికైన ట్లు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో న్యూజిలాండ్ నుంచి వ చ్చిన, రాష్ట్ర కోచ్‌ల పర్యవేక్షణలో క్యాంపు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అ సోషియేషన్ సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమా ర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి సతీష్ యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ సాయినాథ్‌కు అభినందనలు తెలిపారు.

ఇదేం పద్ధతి!



- ఆదాయ వనరులుగా అక్రమ మార్గాలను ఎంచుకుంటున్న తమ్ముళ్లు
- అధికారుల కళ్లెదుటనే కల్తీ మద్యం వ్యాపారం
- కొనసాగుతున్న ఎక్సైజ్ పోలీసుల విచారణ



ములకలచెరువులో యథావిధిగా నడుస్తున్న రాక్‌స్టార్ మద్యం దుకాణం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం కలకలం రేపుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఆదాయమే పరమావధిగా నాయకులు అడ్డదారులు ఎంచుకుంటున్నారు. ఏది పడితే అది దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే ఇసుక, భూములు, రేషన్ బియ్యం, మైనింగ్, మద్యం ఇలా అన్నిచోట్ల అడుగులు పెట్టి అందిన కాడికి పక్కకు తోస్తున్నారు. ఇదేమని అడిగే అధికారులు, ఇది తప్పు అని చెప్పే ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పచ్చ రాజ్యంలో తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. నకిలీ మద్యం వల్ల ప్రాణాలకే ప్రమాదమని తెలిసినా బడా నేతల అభయమో..ముఖ్య నేతల భరోసానో తెలియదుగానీ పెద్ద ఎత్తున ములకలచెరువులో టీడీపీ నేతలు నకిలీ మద్యం తయారు చేయడం హాట్ టాపిక్‌గా మారిపోయింది.

ఇది తగునా?

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదో ఒక పని చేసుకుని మంచిగా సంపాదించుకుంటే ఎవరూ కాదనరు. అలా కాదని అక్రమ, వక్రమార్గాలను ఎంచుకోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు సురేంద్రనాయుడుతోపాటు మరికొంతమంది టీడీపీకి చెందిన కీలక వ్యక్తులు నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్‌షాపులకు పంపిస్తున్న వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ఉంటూ ఏదైనా ప్రజలకు సేవ చేయాల్సిన నేతలు ఇలా చెడు మార్గాలను ఎంచుకోవడంపై ఇది తగునా? అంటూ పార్టీకి చెందినవారే ముక్కున వేలేసుకుంటున్నారు. నకిలీ మద్యం తయారు చేసి షాపులకు పంపడం మూలంగా...నిపుణులు లేకుండా స్పిరిట్‌తో కూడుకున్న విషం ప్రాణాలు తీస్తే అందుకు బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా ఏదో ఒకరకంగా సంపాదించుకోవాలన్న నెపంతో ఎంచుకున్న మార్గం చూసి ప్రతి ఒక్కరూ ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న విచారణ

జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారానికి సంబంధించి ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లా అధికారులు విచారణ చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి, మరో ముగ్గురి కోసం స్పెషల్ బృందాలు గాలిస్తున్నట్లు వెల్లడించారు. పెద్ద ఎత్తున నకిలీ మద్యాన్ని సీజ్ చేసిన ఎక్సైజ్ అధికారులు మరింత లోతుగా దర్యాప్తుచేయాలని, జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఇలాంటి వ్యవహారాలు ఉన్నాయేమో విచారణ జరపాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ద్వంద్వ నీతి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ములకలచెరువు నకిలీమద్యం కేసుకు సంబంధించి నిందితుల్లో ఒకరిపై చర్యలు తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, మరొకరిపై ప్రేమ చూపిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ పెద్దలు, జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత కనుసన్నల్లో సాగిన కేసు దర్యాప్తు తీరే మారిపోయింది. దీంతో చర్యలు నామమాత్రమయ్యాయి. ములకలచెరువు సమీపంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్‌పోలీసులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. టీడీపీ మండల నాయకుడు సురేంద్రనాయుడు ఇంటిలో తనిఖీలు నిర్వహించి అక్కడ పది బాక్సుల నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు ప్రకటించారు. తర్వాత తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దగ్గర పీఏగా పనిచేస్తున్న రాజేష్‌కు సంబంధించిన పాలన్యాస్‌లోనే నకిలీమద్యం తరలిస్తున్నారని గుర్తించి సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేశామని, అతను నిర్వహిస్తున్న మద్యం దుకాణం ఆటోమేటిక్‌గా సస్పెండ్ అవుతుందని, అరెస్ట్ కూడా చేస్తామని శుక్రవారం సాయంత్రం మీడియా సమక్షంలో ప్రకటించారు.

రోజు గడిచాక..

శనివారం ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారి జోగేంద్ర పెద్దతిప్పసముద్రం వచ్చారు. నకిలీమద్యం కేసులో పట్టుబడిన సురేంద్రనాయుడు నిర్వహిస్తున్న ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్రా వైన్స్ మద్యం దుకాణం సీజ్ చేశారు. తర్వాత ములకలచెరువులో మరో నిందితుడైన రాజేష్ నిర్వహణలోని మద్యం దుకాణం రాక్‌స్టార్ సీజ్ చేస్తారని భావించారు. అయితే టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ రాజేష్ పేరుతో ఈ దుకాణం నిర్వహిస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు వెళ్లలేదు. టీడీపీ ముఖ్యనేతల ఒత్తిళ్లతో రాక్‌స్టార్ మద్యంషాపుపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడినట్లు ప్రచారం జరుగుతోంది.

‘పచ్చ’పార్టీకి నకిలీ దెబ్బ

జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు నకిలీ మద్యం వ్యవహారంలో అడ్డంగా దొరికిపోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ప్రసుత్తం దొరికిన నాయకుల వెనుక ముఖ్య నాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పెద్ద నేతల జోలికి వెళ్లకుండా దొరికిన వారి వరకే సర్దుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీలో ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తుండగా, నాయకులు అరెస్టు కావడంతో పచ్చ పార్టీ పరిస్థితి చూస్తే పరువు కాస్త గంగలో కలిసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

- ములకలచెరువు కేంద్రంగా తయారు చేస్తున్న నకిలీ మద్యం ఎక్కడికెక్కడికి సరఫరా చేస్తున్నారన్న దానిపై నిగ్గు తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ప్రాథమిక సమాచారం మేరకు ఇక్కడ తయారు చేసి ప్రముఖ సంస్థ లేబుళ్ల వేసి బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. ఒక్క ములకల చెరువు మండలంలోని బెల్ట్‌షాపులకేనా? లేదా నియోజకవర్గంతో జిల్లా వ్యాప్తంగా సరఫరా జరుగుతుందా? అన్న దానిపై వివరణ ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే నకిలీ మద్యం కాబట్టి తక్కువ ఖర్చుతో ఎక్కువ సొమ్ము చేసుకునేందుకు ఇష్టానుసారంగా విష పదార్థాలు వాడటం మూలంగా తాగే వారి ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో అధికారులు పూర్తి స్థాయిలో విచారించి నకిలీ మద్యం నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం విచ్చలవిడిగా ఏరులై పారుతోందని, ములకల చెరువులో అక్రమ మద్యం, మిషనరీలు పట్టివేతే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీఎమ్మెల్యే కొరముట్లశ్రీనివాసులు విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దశల వారీగా మద్యనిషేధం చేయడానికి బెల్ట్‌షాపులన్నీ రద్దు చేసి పరిమితంగా షాపులు నిర్వహిస్తే చంద్రబాబు వచ్చాక మద్యమే ప్రభుత్వానికి, వారి నాయకులకు ఆదాయ వనరులుగా చేశారని విమర్శించారు. ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహిస్తూ... చంద్రబాబు సొంత జిల్లాలో టీడీపీ ఇన్‌చార్జికి సంబంధించిన వ్యక్తి నకిలీ మద్యం తయారు చేయడానికి చిన్నపాటి పరిశ్రమనే పెట్టుకొన్నారంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇందులో ఎవరి పాత్ర ఉందో దాని వెనకాల ఎవరు ఉన్నారో విచారించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంత జరుగుతున్నా వ్యవస్థలు, యంత్రాంగం ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు చెప్పే మాటలు దేశాలు, ఖండాలు దాటిపోతుంటాయి. కానీ అభివృద్ధి మాత్రం గుండుసున్నా అని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు, ఎరువులు విత్తనాలు అందుబాటులో లేవు. అయితే కల్తీ మద్యం యథేచ్ఛగా దొరుకుతోందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు వెలగచర్ల శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌రమేష్, మందలనాగేంద్ర, శంకరయ్య, రాజ, మహేష్, నందాబాల, సిద్ధు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

పీలేరులో 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



పింఛా నదిలో నీటి ప్రవాహాన్ని చూస్తున్న ప్రజలు

రాయచోటి: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో శనివారం వర్షం కురిసింది. పీలేరులో 84.2 మిల్లీమీటర్లు,సుండుపల్లిలో 28 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.జిల్లాలోని రామసముద్రం, నిమ్మనపల్లి, మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి, కలకడ, కేవీపల్లి, గుర్రంకొండ, రాయచోటి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

తెగిన చెరువు కట్ట..దెబ్బతిన్న పంట పొలాలు

పీలేరు రూరల్: పీలేరు - మదనపల్లె మార్గంలో నాలుగులేన్ల రహదారి విస్తరణలో భాగంగా నిర్మాణం కోసం కొత్తచెరువును తవ్వి వదిలేశారు. శనివారం కురిసిన భారీ వర్షానికి నీరు ఎక్కువుగా చెరువులోకి చేరుకోవడంతో కట్టతెగిపోయింది. దీంతో దిగువన ఉన్న పంటపొలాలు దెబ్బతిన్నాయి. వరి, టమాట, ఆకు కూరలు తదితర పంటలకు నష్టం వాటిల్లింది. భూములు కోతకు గురయ్యాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ శివకుమార్, ఇరిగేషన్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కట్ట పనులు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పీలేరు, సదుం మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షం విస్తారంగా కురిసింది.దీంతో పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నూనెవాండ్లపల్లె మార్గాన్ని తహసీల్దార్ శివకుమార్, సీఐ యుగంధర్ పరిశీలించి రాకపోకలు నిలుపుదల చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీట మునిగిన బస్టాండ్

పీలేరు: పీలేరులో శనివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రోడ్లపై నీరు నిలిచింది.బస్టాండ్ జలయమమైంది. బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆర్టీసీ బస్టాండ్‌కు డ్రైనేజ్ సమస్య ఉన్నందున, వర్షం పడిన ప్రతిసారీ ఇలాగే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది బస్టాండ్‌కు చేరుకుని వర్షపు నీటిని దారిమళ్లించారు.

ప్రజారవాణాలో ఆటోడ్రైవర్ల పాత్ర కీలకం

కలెక్టర్ నిశాంత్‌కుమార్



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తదితరులు

మదనపల్లె రూరల్: ప్రజారవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. శనివారం రవాణాశాఖ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి సంబంధించి జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు పట్టణాల్లో సేవలందించడమే కాకుండా గ్రామాలు, పట్టణాలను కలిపే కీలక పాత్రను పోషిస్తున్నారన్నారు. విద్యార్థిదశలో తనకు ఆటో డ్రైవర్లతో ఏర్పడిన భావోద్వేగ బంధాన్ని మరచిపోలేనన్నారు. సివిల్ సర్వీసెస్‌కు ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు తన ఆందోళనను గుర్తించిన ఆటోడ్రైవర్, ఇచ్చిన మానసిక ధైర్యం నేటికీ మరచిపోలేనన్నారు. ఆటోడ్రైవర్లు ప్రభుత్వం అందిస్తున్న 15వేల ఆర్థికసహాయాన్ని కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకానికి సంబంధించి అన్నమయ్యజిల్లా వ్యాప్తంగా మొత్తం 8,835 మంది ఆటో డ్రైవర్లకు రూ.13.25 కోట్ల రూపాయల నగదు జమచేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీఓ అశోక్‌ప్రతాప్, ఎంవీఐ దినేష్‌చంద్ర, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఏఎంవీఐలు శివలింగయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మైండ్ గేమ్!



- మేయర్ ఎన్నిక, పోటీలో పలువురు కార్పొరేటర్లంటూ కొత్త పల్లవి

సాక్షి ప్రతినిధి, కడప: ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు సృష్టించడంలో టీడీపీ నేతలకు మరెవ్వరూ సాటి రారు. తాజాగా కడప కార్పొరేషన్‌లోనూ ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయ అలజడితో లబ్ధి పొందాలనే కొత్త కుట్రలకు తెరతీశారు. తమ్ముళ్ల ఎత్తుగడలకు ఎల్లో మీడియా వంతపాడుతోంది. కడప మేయర్‌కు సంబంధించి ఉన్నత న్యాయస్థానంలో వ్యవహారం నడుస్తోంది. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎమ్మెల్యేకు హైకోర్టు ఉత్తర్వులున్నాయి. ఇప్పటికిప్పుడే కోర్టులో వ్యవహారం తేలిపోయే అవకాశం లేదు. అయినప్పటికీ మేయర్ ఎన్నిక, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మధ్య బహుముఖ పోటీ అంటూ తెలుగుతమ్ముళ్లు మైండ్‌గేమ్ ఆడుతున్నారు.

- కడప మేయర్ సురేష్‌బాబుపై ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం అనర్హత చర్యలపై మాజీ మేయర్ సురేష్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈనెల 7కు వాయిదా వేస్తూ, ఆ రోజు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఫిర్యాదుదారు కడప ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలైన తర్వాత ఇరుపక్షాల వాదనల అనంతరం ఫైనల్ తీర్పు వెలువడనుంది. ఈతతంగం ముగిసేంత వర కూ మేయర్ ఎన్నిక ఉత్పన్నమయ్యే అవకాశమే లేదు. ఇదిలాఉంటే... వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య అలజడి లేపేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. కడప మేయర్ సీటు కోసం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య బహు ముఖ పోటీ అంటూ పచ్చ నేతలు తానా అంటుంటే.. ఆ రెండు పత్రికలు తందాన అంటూ వంత పాడుతున్నాయి.
- ‘అదిగో పులి అంటే ఇదిగో తోక’అన్నట్లుగా టీడీపీ నేత లు, ఎల్లోమీడియా వైఖరి ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పేర్లు వారే ప్రకటించడం, వారే ప్రచారం చేయడం ఒకదాని వెంట ఒకటి తెరపైకి వస్తున్నాయి.

అభద్రతాభావం సృష్టించేందుకు...

మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు పడగానే, డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముస్లిం మైనార్టీకి చెందిన ముంతాజ్‌బేగంకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఇకపై ముస్లిం మైనార్టీకి చెందిన మహిళ కడప కార్పొరేషన్ మేయర్‌గా పాలించనున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి కూడా ప్రకటించారు. ముంతాజ్ బేగం బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ముఖ్యనేతలంతా సంయుక్తంగా హాజరయ్యారు. ఇదిలా ఉంటే ఇన్‌చార్జ్ మేయర్‌లో అభద్రతాభావం సృష్టించేందుకు కూడా మేయర్ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ వారే పోటీ పడుతున్నారని ప్రచారం చేస్తున్నట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవంగా ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్‌బేగం ప్రసన్నం కోసం టీడీపీ నేతలు ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతం చేసేందుకు తమ కుటుంబం కట్టుబడి ఉంటుందని ఆమె ప్రకటించడంతో టీడీపీ నేతలు తోకముడిచారు. తిరిగి మేయర్ ఎన్నికంటూ దుష్ప్రచారం చేసి.. ఇన్‌చార్జ్ మేయర్‌లో అభద్రతాభావం కల్పిస్తే రాజకీయంగా లబ్ధి పొందవచ్చుననే దురాలోచన కూడా తెలుగుతమ్ముళ్లకు ఉన్నట్లు పలువురు స్పష్టం చేస్తున్నారు.

పల్లె వైద్యంపై సమ్మెట

- గ్రామీణులకు లభించని వైద్య సేవలు
- తొమ్మిదోరోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన
- చోద్యం చూస్తున్న కూటమి పాలకులు



చిన్నమండెం మండలం చాకిబండ పీహెచ్‌సీ భవనం



రాయచోటి: ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి వైద్యులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. ఆసుపత్రుల్లో ఉండాల్సిన వైద్యులు విజయవాడలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. దశల వారీగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా గతనెల 26వ తేదీ నుంచి వైద్యులు విధులను బహిష్కరించి ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామీణుల ఆరోగ్యం అగమ్యగోచరంగా మారింది.

అరకొర ప్రత్యామ్నాయం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సమ్మె తలపెట్టడంతో ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలు తగినంత ఫలితాలు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు డెంటల్, స్కిన్, ఆర్థో, కంటి వైద్య నిపుణులను అక్కడక్కడ ఏర్పాటు చేసినా ఫలితాలు కనిపించలేదు. దీంతో ఆసుపత్రికి వచ్చిన వారు నర్సులు, సిబ్బంది అందిస్తున్న వైద్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో 30 మండలాల్లో మొత్తం 51 పీహెచ్‌సీలు ఉన్నాయి. బంద్ కారణంగా వీటిల్లో వైద్యుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికులు వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొందరు సమీపంలోని ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ వైద్యం పడకేయడంతో పల్లె వాసులు అవస్థలు పడుతున్నారు.

సమ్మెను విఫలం చేసేందుకు యత్నాలు

ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలి, టైమ్ బౌండ్ పదోన్నతులు అమలు చేయాలి, పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పని గంటలను నిర్దేశించాలంటూ వైద్యులు సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మెలో జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమ్మెను విఫలం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి తదితర ప్రభుత్వ విభాగాల నుంచి కొంతమంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా టీడీపీ కూటమి పాలకులు ఏమాత్రం స్పందించకపోవడం పట్ల గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అందరి మద్దతు కోరుతాం..

సమ్మెకు ఇతర ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైమరీ ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న వైద్యుల మద్దతును కూడా కోరుతాం. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

–రమేష్ బాబు,
ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ఆవు ఢీకొనడంతో బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన కాంతమ్మ

మదనపల్లె రూరల్ : రోడ్డుపై వెళుతున్న ఆవులు, ఉన్నట్లుండి గెంతుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడగా, అందరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ ఆరోగ్యపురానికి చెందిన కాంతమ్మ(57), సుమంత్ (35) మదనపల్లెలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఊరు దగ్గరే, రోడ్డుపై వెళుతున్న ఆవు గెంతుకుంటూ వచ్చి ఒక్కసారిగా బైక్‌పై పడటంతో ఇద్దరూ కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించాక, కాంతమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

చింతలకుంటలో అగ్నిప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నందలూరు : మండలంలోని చింతలకుంట గ్రామం హరిజనవాడలో బల్లి ఓబులేసు అనే వ్యక్తి ఇంట్లో శనివారం అగ్నిప్రమాదం జరగడంతో దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బాధితుల కథనం మేరకు ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలోని ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాప్తి చెందాయి. ఈ సంఘటనలో రూ.2.50 లక్షల బంగారు, ఇంటిలోని పలు రకాల వస్తువులు, దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న రాజంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


కొత్త్రోళ్ల చిన్న వెంకట్రమణ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ రేకులగుంటిపల్లికి చెందిన కొత్త్రోళ్ల చిన్న వెంకట్రమణ (49) కనిపించడం లేదని అతని కుమారుడు మంజునాథ్ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. తన తండ్రి గత నెల 30న తిరుపతికి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లాడని, ఐదు రోజులైనా ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటంకాలు తొలగేలా.. ఆటలో మెరిసేలా..!

- నందలూరులో సొంత నిధులతో ఐదు ఎకరాల్లో క్రికెట్ మైదానం
- విజయవాడ తర్వాత క్రికెట్‌లో రాణింపునకు టర్ఫ్ వికెట్ పిచ్
- అందుబాటులోకి అంతర్జాతీయ స్థాయి స్టేడియం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మహమ్మద్ షేక్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. నందలూరు బస్టాండులో టీ దుకాణం కొన్ని దశాబ్దాల నుంచి నిర్వహించుకుంటూ వస్తున్నారు. తన బిడ్డలు షేక్ ఆదిల్ హుసేన్, ఆసిఫ్‌లు క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి వరకు వెళ్లారు. ఎలాగైనా జాతీయ స్థాయిలో భారత జట్టుకు ఆడాలనే బిడ్డల తపన, కృషి చూసిన తండ్రి తన బిడ్డలాగానే, తమ ప్రాంతం నుంచి క్రికెటర్లు మరికొందరు రాణించాలనే ఆలోచనతో క్రికెట్ ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేశారు.


పచ్చని గడ్డితో సిద్ధమవుతున్న క్రికెట్ క్రీడా మైదానం

రాజంపేట : కడప–రేణిగుంట ప్రస్తుత హైవేలో నుంచి కిలోమీటర్ దూరం ఈదరపల్లె ఎస్టీకాలనీకి సమీపంలో నందలూరు సౌమ్యనాథాలయ రథం దారిలో ఐదు ఎకరాలను మహమ్మద్‌షేక్ పదేళ్లకు లీజుకు తీసుకున్నారు. దానిని క్రికెట్ స్టేడియంగా రూపొందిస్తున్నారు. క్రికెట్ శిక్షణ టోర్నమెంట్‌కు అవసరమైన రీతిలో ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడాలేని నెట్, గ్రౌండ్ ఉండే విధంగా క్రికెట్ మైదానాన్ని తీర్చిదిద్దుతున్నారు. తన స్థాయి ఎంత కష్టమైనా సరే..అన్నట్లుగా దాదాపు రూ.25 లక్షల వ్యయంతో తొలుత మైదానం చదును, మైదానంలో క్రికెట్ ఆటగాళ్లకు అనువైన రీతిలో గడ్డిని పెంచారు. బౌండరీలను ఏర్పాటు చేయడం, గ్యాలరీ తదితర క్రికెటర్లకు సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలుగా తన ఇద్దరు కొడుకులు ఆదిల్, ఆసిఫ్‌లు, సమీప బంధువు క్రికెటర్ జాఫర్(స్టేట్‌ప్లేయర్)తో కలిసి రూపకల్పన చేస్తున్నారు.

క్రికెట్‌లో రాణించేందుకు...


క్రికెట్‌లో రాణించేందుకు క్రికెట్ మైదానంలో సకల సదుపాయాలను కల్పించనున్నారు. హైస్టాండర్డ్ క్రికెట్ గ్రౌండ్, వన్ అండ్ వన్ కోచింగ్, సీనియర్ క్రికెటర్లతో శిక్షణ, రెగ్యులర్‌గా ఓపెన్ నెట్ సెషన్స్‌లు ఉంటాయి. తరచుగా ప్రాక్టీస్ మ్యాచ్‌ల ఏర్పాటు. టోర్నమెంట్ల నిర్వహణతోపాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా క్రికెటర్ ఫ్యామిలీ ముందుకెళుతోంది. వసతి పరంగా ఓపెన్ డార్మెంటరీ క్రీడాకారులకు ఇంటి భోజనం తరహాలో అందించడం, కామన్ టీవీ ఏరియా, నిరంతరం మంచినీటి సదుపాయం దశలవారీగా క్రికెట్ మైదానంలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఉమ్మడి కడప జిల్లాలో మ్యాచ్‌లకు క్రికెట్ క్రీడా మైదానం..

ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడాలేని విధంగా నెట్‌తో పాటు క్రీడామైదానం కలిగివుండటం వలన క్రికెట్ అసోసియేషన్లు నిర్వహించే మ్యాచ్‌ల నిర్వహణకు దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రీతిలో మైదానాలు లేక అనేక మందిలో దాగివున్న క్రికెట్ నైపుణ్యాలు వెలికితీసేందుకు అవసరమయ్యే శిక్షణ, మైదానాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇప్పుడు నందలూరులో ఏర్పాటు కాబోతున్న క్రికెట్ మైదానం ఎందరో క్రికెటర్‌లను ఈ దేశానికి, రాష్ట్రానికి అందజేస్తుందనే ఆశాభావం క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతోంది.

తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ మైదానం..

విజయవాడ తర్వాత క్రికెటర్స్ ఫ్యామిలీ నందలూరు క్రికెట్ క్రీడా మైదానంలో అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం, పిచ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇదే ప్రప్రథమనే చెప్పవచ్చు. అంతర్జాతీయ క్రికెటర్స్ ఆడే మ్యాచ్‌లో వినియోగించే పిచ్ టర్ఫ్ వికెట్ విజిబిలిటీ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం విశేషంగా క్రికెట్ క్రీడాభిమానులు చెప్పుకుంటున్నారు.


అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ పిచ్ టర్ఫ్ వికెట్ విజిబిలిటీ (నమూనా)

క్రికెట్ మైదానం ఎక్కడంటే..

కడప–రేణిగుంట జాతీయరహదారి మండల క్లాంపెక్స్ నుంచి కిలోమీటర్‌లో ఈదరపల్లె రహదారిలో క్రికెట్ క్రీడామైదానాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రశాంత వాతావరణంలో, చుట్టూ పంటపొలాలు, తోటలు ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడామైదానం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు క్రికెట్ క్రీడాకారుల దృష్టి దీనిపై పడింది. నందలూరు రైల్వేకేంద్రం నుంచి బస్టాండుకు చేరుకొని అక్కడి నుంచి మండల క్లాంపెక్స్‌కు మార్గంలో వెళ్లాలి. ఈదరపల్లె ఎస్టీ కాలనీ దాటిన తర్వాత నందలూరు సౌమ్యనాథస్వామి రథం దారిలో దీనిని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ఈ యువ క్రీడాకారుడి పేరు షేక్ ఆదిల్ హుసేన్.. చిన్నప్పటి నుంచి క్రికెట్‌లో రాణించాలనే తపనతో అనునిత్యం ప్రాక్టీస్‌లోనే బాల్యం, యువ జీవితం గడుపుతున్నాడు. జోన్, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అనేక క్రికెట్ పోటీలలో తన ప్రతిభను చాటుకున్నాడు. ఎలాగైనా భారత జట్టుకు ఆడాలనే కృషితో క్రికెట్ క్రీడలో రాటుదేలుతున్నాడు. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.



ఇతని పేరు షేక్ ఆసిఫ్. ఇతను కూడా తన సోదరుడితో పాటే క్రికెట్‌లో వివిధ స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నాడు. స్టేట్ ప్లేయర్‌గా రాణించాడు. ఇతనికి కూడా జాతీయ స్థాయిలో క్రికెటర్‌గా రాణించాలనే లక్ష్యం ఉంది. అందుకు తగ్గట్టుగా కృషి చేస్తున్నాడు. తోటి యువతను క్రికెట్ రంగం వైపు మళ్లించేందుకు తన తండ్రి ప్రోత్సాహంతో క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసుకొని, తమ ప్రాంతానికి క్రికెట్ పరంగా గుర్తింపు తీసుకురావాలనే తలంపుతో ముందుకెళుతున్నాడు. బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు.



ఈ యువ క్రీడాకారుడు జాఫర్. నందలూరు గ్రామం. స్టేట్‌ప్లేయర్‌గా రాణించాడు. అన్ని స్థాయిల్లో క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకుంటూ వెళుతున్నాడు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ సహకారం అందిస్తే గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లే క్రికెటర్లను ఈ దేశానికి అందించవచ్చనే ఉద్దేశంతోనే తాము క్రీడా మైదానం, అంతర్జాతీయ స్థాయిలో ఆటగాళ్లు ఆడే టర్ఫ్ వికెట్ విజిబిలిటి పిచ్‌ను ఏర్పాటుచేస్తున్నాము. బ్యాట్స్‌మెన్‌గా రాణించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్ : కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం జరిగింది. తంబళ్లపల్లె మండలం ముద్దలదొడ్డికి చెందిన శశిధర్‌రెడ్డి(23), కిరణ్‌కుమార్‌రెడ్డి(25) ఇద్దరూ మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బి.కొత్తకోట మండలం శీతోళ్లపల్లె స్టాప్ వద్ద కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీలేరులో చోరీ


ఇంటిలో కప్‌బోర్డులు తెరిచిన దుండగులు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలోని జర్నలిస్టు కాలనీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక జర్నలిస్టు కాలనీలో ఉంటున్న యు. రాజేష్ విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని విషయం తెలుసుకున్న దుండగులు తలుపు పగుల గొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటిలో వెండి వస్తువులు, నాలుగు పట్టుచీరలు, రూ. 20వేలు నగదు, జత కమ్మలు, జత గాజులు కలిపి సుమారు 25 గ్రాముల బంగారు నగలతో ఉడాయించారు. శనివారం ఉదయం ఇంటిలో జరిగిన సంఘటన గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వేలిముద్ర నిపుణులు ఆధారాలు సేకరించారు.

బీసీ స్టడీ సర్కిళ్ల ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

రాయచోటి జగదాంబసెంటర్ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 13 బీసీ స్టడీ సర్కిళ్లలో పని చేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు కోరారు. శనివారం రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ స్టడీ సర్కిళ్లను నమ్ముకొని పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ దినసరి కూలీలు, పేద మధ్య తరగతి ఉద్యోగులందరికీ అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. 2022 పీఆర్‌సీ ప్రకారం జీతభత్యాలను పెంచాలని, పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని కోరారు. శిక్షణ పొందే అభ్యర్థులకు రూ.1500 నుండి రూ.4500లకు శిక్షణ భృతి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్!

రామసముద్రం : లబ్ధిదారులకు పెన్షన్ నగదు పంపిణీ చేయకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడిన సంఘటన రామసముద్రం మండలంలో జరిగింది. ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ వివరాల మేరకు ఆర్.నడింపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గిరి పెన్షన్‌దారులకు నగదు పంపిణీ చేయకపోవడంతో ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై విచారణ చేయగా వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ నగదుతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇప్పటివరకు విచారణలో రూ.2.56 లక్షల పింఛన్ సొమ్ము తేలిందన్నారు. గతంలో పీటీఎం మండలంలో పనిచేసేటప్పుడు కూడా పింఛన్ సొమ్మును ఆన్‌లైన్ గేమ్ ఆడేందుకు వినియోగించడంతో అక్కడ సస్పెండ్ అయ్యాడన్నారు. పెన్షన్ సొమ్మును దుర్వినియోగం చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ పై డీఆర్‌డీఏ పీడీకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

5జీ మొబైల్స్ ఇచ్చే వరకు విధుల బహిష్కరణ

ఒంటిమిట్ట (సిద్దవటం) : 5జీ మొబైల్స్ ఇచ్చే వరకు ఆన్‌లైన్ పనులు బహిష్కరిస్తున్నామని ఒంటిమిట్ట వెలుగు వీఓఏలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట వీఓఏలు ఏపీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5జీ మొబైల్స్ ఇవ్వకుండా కింది స్థాయిలో ఆన్‌లైన్ పనులు చేయలేదని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి పనికి లక్ష్యాన్ని పెట్టి ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


వెలుగు ఏపీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఒంటిమిట్ట మండల వీఓఏలు

మీ సహకారం మరువలేను

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎస్పీగా 14 నెలల పాటు సేవలందించి బదిలీపై కృష్ణా జిల్లా ఎస్పీగా వెళ్లిన వి.విద్యాసాగర్‌నాయుడుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ దంపతులను జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో శనివారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ సేవలను కొనియాడారు. ఎస్పీతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ గతంలో తాము పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసి పనిచేశామన్నారు. ఆయనకున్న నిబద్ధత, నిజాయితీని ప్రశంసించారు. నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సేవలు జిల్లాకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. బదిలీ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ గత 14 నెలలలో నేరాల నియంత్రణ, పిల్లలపై నేరాలను అరికట్టడం, మహిళల కోసం అవగాహనా కార్యక్రమాలు చేపట్టాం.. ప్రజలకు మంచి సేవలు అందించానన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీలు, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లి డీఎస్పీలు కృష్ణమోహన్, మహేంద్ర, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో పెద్ద చౌరెడ్డి (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు మండల పరిధిలోని అంజనపురం గ్రామానికి చెందిన పెద్ద చౌరెడ్డి సొంత పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి పట్టణానికి వస్తుండగా మార్గమధ్యంలోని పెన్నానది బ్రిడ్జి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో ఏటూరు కాలువ వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల మేరకు... 50 ఏళ్ల పైబడిన గుర్తు తెలియని మగ వ్యక్తి శవాన్ని గుర్తించామన్నారు. మృతదేహం బాగా కుళ్లిపోవడంతో ముఖం కూడా కనిపించడం లేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడి దుర్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం ఉదయం రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు(35) దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసు ఎస్‌హెచ్‌ఓ నాగాంజనేయులు సమాచారం మేరకు మృతుని వద్ద జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించినట్లు బస్సు టికెట్ ఉంది. మృతుని శరీరంపై వున్న టీ–షర్టు ముందు భాగంలో నారాయణ మెడికల్ కాలేజీ 2020 అని ముద్రించి ఉంది. మృతుని వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు


గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్

మదనపల్లె రూరల్ : ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి ఏఆర్ కానిస్టేబుల్ గాయపడిన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం పెద్దయల్లకుంట్ల పంచాయతీ బోయపల్లెకు చెందిన అమరనాథ్(30), రాయచోటిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. గ్రామానికి వెళ్లే క్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు వేగంగా వెళ్లాడు. వర్షం కారణంగా బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

• నెలవంక తొంగి చూసే..!



మదనపల్లె పట్టణంలో శనివారం సాయంత్రం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. చిరుజల్లులు కురిసి మేఘావృతమైన సమయంలో నెలవంక చుట్టూ చేరిన వెలుగులు చూపరులను ఆకట్టుకోగా...అదే క్రమంలో స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం గోపురంపై చంద్రుడి వెలుగులో చూపరులను ఆకర్షించింది.

– మదనపల్లె సిటీ


ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చారణతో కల్యాణ క్రతువు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కనులారా దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిద్ధాంతి ఇడమకంటి జనార్దన శివాచార్య, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు కూటమి నేతల కుట్ర

- తమ భూమికి అన్ని ఆధారాలు ఉన్నా అధికార పార్టీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారని రైతు ఆవేదన
- హోం మంత్రికి ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా మామిడి చెట్లు నరికి కంచె తొలగించారని ఆరోపణ


భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు(ఫైల్)


కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తనకు వారసత్వంగా వచ్చిన రిజిస్టర్డ్‌భూమిని తాను గత 35 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, అయితే కూటమి నాయకులు దౌర్జన్యంగా తన పొలంలో ఉన్న 25 మామిడి చెట్లను నరికి వేసి, తన పొలం చుట్టూ వేసుకున్న ఇనుప కంచెను తొలగించారని రైతు చెన్న కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని కుర్నూతల గ్రామం, మూలపల్లెకు చెందిన ఎ.చెన్నారెడ్డికి అదే గ్రామ పొలంలో సర్వే నంబరు 792/2 లో 0.63 సెంట్లు, 797/3లో 1.71 ఎకరాలు పొలం ఉంది. తన పొలం పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన వేల్పుచర్ల ఓబుల్ రెడ్డి, సహదేవరెడ్డి, వాసుదేవరెడ్డి, మాజీ సైనికుడు రమణారెడ్డి తదితర కూటమి నేతలు తమపై దాడిచేసి తన పొలంలోని కొంత భాగాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతు పేర్కొన్నారు. ఈ విషయమై 2023లోనే అప్పటి తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐకి ఫిర్యాదు చేశామన్నారు. వారి ఆదేశాల మేరకు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారుల సూచన మేరకు తహసీల్దార్, సర్వేయర్, సీఐ, ఎస్‌ఐల సమక్షంలోనే తమ పొలం చుట్టూ ఇనుప స్తంభాలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తమ పొలంతో పక్క పొలం వారికి ఎలాంటి సంబంధం లేదని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చిందని రైతు చెన్నారెడ్డి తెలిపారు. తమ పొలానికి అన్ని రికార్డులు సవ్యంగా ఉండటంతోపాటు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నా కూడా కూటమి నేతలు తమకు తెలియకుండా తమ పొలంలో నాటిన ఇనుప కంచెను తొలగించి, స్తంభాలను ఎత్తుకెళ్లడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయంపై ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత, ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేసి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తమ భూమికి సంబంధించిన రికార్డులను లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించామని, కూటమి నాయకులు వారి రికార్డులను తీసుకురాకుండానే తమ పొలంలో ఉన్న 25 మామిడి చెట్లను దౌర్జన్యంగా నరికేయడంతో రూ.3 లక్షల పైబడి తమకు నష్టం వాటిల్లిందని వాపోయారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తనకు న్యాయం చేయడంతో పాటు కూటమి నాయకుల నుంచి రక్షణ కల్పించాలని రైతు కోరుతున్నాడు.